Title Code:T/TG/2024/0625/0392/884

# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం – మననేత్రం

Follow

పేజీలు 12

సోమవారం, 28 ఏప్రిల్, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## ప్రతీ భారతీయుడు కోపంతో రగిలిపోతున్నాడు



అనంతనాగ్, ఏప్రిల్ 27: ఆదివారం జరిగిన మన్‌కీబాత్ 121వ కార్యక్రమంలో ప్రధాని మాట్లాడుతూ.. ఈ దాడిలో పాల్గొన్న ఉగ్రవాదుల వెన్నువిరుస్తామన్నారు. 'ఈ ఘటన ఎంతగానో కలిచివేసింది. ప్రతి భారతీయుడు కోపంతో రగిలిపోతున్నాడు. జమ్మూకశ్మీర్‌లో శాంతిని స్థాపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. జమ్మూలో పాఠశాలలు, కళాశాలలు తెరచుకుంటున్నాయి. అక్కడ ప్రజాస్వామ్యం బలపడుతోంది. పర్యాటక రంగం అభివృద్ధి చేస్తోంది. ఇదంతా చూసే ఉగ్రవాదులు కశ్మీర్‌ను టార్గెట్ చేశారు. ఈ దాడికి పాల్పడిన వారికి కఠినమైన శిక్ష విధిస్తాం. 140 కోట్ల మంది ప్రజల మద్దతు భారత సైన్యానికి అతిపెద్ద బలం. ఈ దాడిని భారత ప్రజలు ఒకే గొంతుతో వ్యతిరేకించాలి. భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు మరోసారి కృతజ్ఞతలు.' అని పేర్కొన్నారు.



# నా మనసు కాలుతోంది. బాధ పడుతోంది

**ఆనాడైనా, ఈనాడైనా తెలంగాణకు నంబర్ వన్ విలన్ కాంగ్రెస్సే**

**ప్రజలంతా ఓ నిర్ణయానికొచ్చారు.. ఓట్లెప్పుడొస్తాయా అని చూస్తున్నారు**

- 420 హామీలిచ్చి ఏమీ చేయకుండా ప్రజలను దగా చేశారు
- రాష్ట్ర ప్రభుత్వాన్ని మేం పడగొట్టం.. ప్రజలే వీపులు సాపు చేస్తారు
- మంచిగున్న తెలంగాణను ఆగం చేశారు.. కేసీఆర్‌ను మించి చేస్తామన్నారు
- మమ్మల్ని మించిన సిపాయిలు లేరన్నారు..కాంగ్రెస్ అన్నిట్లోనూ ఫెయిల్
- కాంగ్రెస్‌ను గద్దె దించేందుకు తాను బయటకు వస్తానని ప్రకటన
- తెలంగాణ చెలరేగింది..మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టీకరణ

2వ పేజీలో ⏭

మంచిగున్న తెలంగాణను ఆగం పట్టించి ఓట్లు వేయించుకుని ప్రజలను మోసం, దగా చేశారు. ఇవాళ అప్పు పుడత లేదని మాట్లాడుతుండ్రు. నా మనసు కాలుతోంది. బాధ పడుతోంది.దుఃఖం వస్తోంది. కాంగ్రెస్ సర్కార్ వచ్చి ఏడాదిన్నరయ్యింది.. ఏ మాయ రోగం వచ్చె.. ఏం బీమారి వచ్చె.. ఏమేం చెప్పిరి.. ఎన్నెన్ని చెప్పిరి.. గోల్‌మాల్ దింపుట్ల,అబద్ధాలు చెప్పుట్ల కాంగ్రెస్‌ను మించినోళ్లు లేరు. అప్పుడు చెరువుల పూడిక తీసిన బుల్డోజర్లు, ఇప్పుడు ఇళ్లు కూలగొడుతున్నయి. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నరు. ఓట్లెప్పుడు వస్తయా అని చూస్తున్నరు. - కేసీఆర్

### ఆపరేషన్ కగార్ ఆపాల్సిందే

కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్‌లో యువకులను, గిరిజనులను ఊచకోత కోస్తున్నది. అది ధర్మం కాదు. నక్సలైట్లు ప్రతిపాదన పెడుతున్నరు. మేము ప్రభుత్వం దగ్గరికొచ్చి చర్చలు చేయడానికి సిద్ధంగా ఉన్నమని అంటున్నరు. నేను కేంద్రాన్ని కోరుతున్నా. బలం ఉందికదా అని చంపుకుంట పోవడు కాదు. అది ప్రజాస్వామ్యం కాదు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపేయండి. నక్సలైట్లను పిలిచి చర్చలు జరపండి. వాళ్లు ఏమి మాట్లాడుతరో చూడండి. అదిగూడ నల్లనా తెల్లనా దేశం ముందటికి రానీయండి. అట్లకాదు, మొత్తం నరికి పారేస్తం, కోసి పారేస్తం అంటే ఎలా? మిలట్రీ మీదగ్గర ఉన్నది కాబట్టి కొడతరు. కానీ అది ప్రజాస్వామ్యం అనిపించుకోదు. అది ధర్మం కాదు. - కేసీఆర్

## ఇప్పుడు రాలేను.. సమయం ఇవ్వండి

### ఈడీ విచారణకు సమయం కోరిన మహేష్ బాబు



**హైదరాబాద్:** సాయిసూర్య డెవలపర్స్‌పై నమోదైన మనీలాండరింగ్ కేసులో ఈడీ ఎదుట విచారణకు హాజరయ్యేందుకు కొంత సమయం ఇవ్వాలని నటుడు మహేశ్ బాబు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ను కోరారు. ముందస్తు షెడ్యూల్ ప్రకారం షూటింగ్‌లకు హాజరు కావాల్సి ఉన్నందున మరికొంత సమయం ఇవ్వాలని కోరుతూ లేఖ రాసినట్లు తెలిసింది. ఈ నెల 22న ఈడీ ఇచ్చిన సమన్ల ప్రకారం సోమవారం బషీర్‌బాగ్ ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాల్సి ఉంది. కాగా, సాయి సూర్య డెవలపర్స్ వెంచర్స్ ప్రాజెక్టు ప్రమోషన్ కోసం మహేశ్‌బాబు రూ.5.9 కోట్లు తీసుకున్నట్టు అధికారులు ఆధారాలు సేకరించారు. దీనిపై మరింత లోతుగా విచారించేందుకు మహేశ్‌బాబుకు సమన్లు జారీ చేశారు. సురానా గ్రూప్ కంపెనీలైన సాయిసూర్య డెవలపర్స్, భాగ్యనగర్ ప్రాపర్టీస్ సంస్థల్లో ఈ నెల 16న ఈడీ సోదాలు చేసిన విషయం తెలిసిందే. ఈ సోదాల్లో మహేశ్‌బాబుకు చెక్కుల రూపంలో రూ.3.4 కోట్లు, నగదు రూపంలో రూ.2.5 కోట్లు చెల్లించినట్లు ఆధారాలు లభించాయి.



## సోనియాకు సాష్టాంగ నమస్కారం మరిచారా?

### తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలనా

- కాంట్రాక్టర్లకు బకాయిలు, సర్పంచ్‌లకు బాకీలు కేసీఆర్ హయాంలో పెట్టినవే..
- మేం ఇబ్బంది పెట్టాలనుకుంటే సభ జరిగేదేనా?: మంత్రి పొంగులేటి
- నియంతలా కేసీఆర్ మాటలు: సీతక్క
- సోనియాగాంధీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేయాలి: పొన్నం
- కేసీఆర్‌లో ఇంకా గర్వం పోలేదు: జూపల్లి

2వ పేజీలో ⏭

**హైదరాబాద్, ఏప్రిల్ 27:** మనసంతా విషాన్ని నింపుకొన్న కేసీఆర్.. కాంగ్రెస్ పార్టీని విలన్‌గా చూపించే ప్రయత్నం చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. హైదరాబాద్‌తో కూడిన తెలంగాణ రాష్ట్రం ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీని విలన్‌గా చూపిస్తున్నారా? అని నిలదీశారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీకి కేసీఆర్ సాష్టాంగ నమస్కారం చేసిన సంగతి మరిచిపోయారా?

## హరిరామ్ ఆస్తులు రూ.250 కోట్లపైనే..!

- బహిరంగ మార్కెట్‌లో ఆస్తుల విలువపై ఏసీబీ అంచనా
- భూములు, విల్లాలు, కార్లు, బంగారం గుర్తించిన ఏసీబీ
- బినామీలపై ఆరా తీస్తున్న అధికారులు
- చంచల్‌గూడ జైలుకు హరిరామ్ తరలింపు



**హైదరాబాద్:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం గజ్వేల్ ఈఎన్సీ భూక్యా హరిరామ్ ఆస్తులపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి రాష్ట్రవ్యాప్తంగా 14 ప్రాంతాల్లో ఏక కాలంలో సోదాలు చేసిన ఏసీబీ బృందాలు పలుచోట్ల భూములు, ఇతర ఆస్తులు ఉన్నట్టు గుర్తించాయి. ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.250 కోట్లకు పైనే ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే స్వాధీనం – మిగతా 2వ పేజీలో

వాయిస్ టుడే
జనగాత్రం - మనపత్రం
హైదరాబాద్
సోమవారం, 28 ఏప్రిల్, 2025

# హరిరామ్ ఆస్తులు రూ.250 కోట్లపైనే..!

(మొదటి పేజీ తరువాయి)

చేసుకున్న ఆస్తుల పత్రాలను పరిశీలిస్తున్నారు. హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలో రెండు ఇండిపెండెంట్ గృహాలు, షేక్‌పేటలో ఒక విల్లా, కొండాపూర్‌లో ఒక విల్లా, మాదాపూర్‌లో ఒక ఫ్లాట్, నార్సింగిలో ఒక ఫ్లాట్, అమరావతిలో ఒక వాణిజ్య స్థలం, మర్కూక్ మండలంలో 28 ఎకరాల వ్యవసాయ భూమి, పటాన్‌చెరులో 20 గుంటల భూమి, బొమ్మలరామారంలో 6 ఎకరాల్లో మామిడి తోటతో కూడిన ఫామ్ హౌస్, కొత్తగూడెంలో నిర్మాణంలో ఉన్న ఒక భవనం, కుత్బుల్లాపూర్‌లో, మిర్యాలగూడలో స్థలాలు ఉన్నట్టు కీలక ఆధారాలను అధికారులు సేకరించారు. బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువుల విలువ కట్టేపనిలో ఉన్నారు. అదేవిధంగా మూడు బ్యాంకు లాకర్లను అధికారులు గుర్తించారు. ఈ లాకర్లను తెరిచేందుకు అనుమతి కోరుతూ అధికారులు సోమవారం కోర్టులో మెమో దాఖలు చేయనున్నట్టు సమాచారం. కాగా, శనివారం అర్ధరాత్రి వరకు సోదాలు జరిపిన అధికారులు.. హరిరామ్‌ను అరెస్టు చేసి జడ్జి ముందు హాజరుపర్చగా. 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు చంచల్‌గూడ జైలుకు తరలించారు. బినామీలపై ఆరా: ఈఎన్సీ హరిరామ్ అక్రమార్జనను కొందరు బినామీల పేరిట పెట్టినట్టు ఏసీబీ అధికారులు అనుమానిస్తున్నారు. వారు ఎవరు, ఎక్కడెక్కడ వారి పేరి ట ఆస్తులు ఉన్నాయనే కోణంలోనూ దర్యాప్తు ముమ్మరం చేశారు. జలసౌధ కార్యాల యంలో సేకరించిన పలు పత్రాలు, హరిరామ్ ఇంట్లో లభించిన పత్రాలను పరిశీలించే పనిని ప్రత్యేక టీంకు అప్పగించినట్టు తెలిసింది. హరిరాం ఇంట్లో, సిద్దిపేట జిల్లా మర్కూక్ తహసీల్దార్ ఆఫీసులో స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్ల ఆధారంగా ఆయన భార్య అనితపై కూడా ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# దక్షిణాది అన్ని రాష్ట్రాల్లో జెండా ఎగరేస్తాం



**హైదరాబాద్, ఏప్రిల్ 27:** విజయవాడలో ఆదివారం జరిగిన అంబేద్కర్ 135వ జయంత్యోత్సవాల్లో భాగంగా మేధావుల సదస్సులో పాల్గొన్న కిషన్‌రెడ్డి, ప్రధాని మన్‌కీబాత్ కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం మేధావుల సదస్సులో ప్రసంగిస్తూ స్వాతంత్ర ఉద్యమంలో కీలకపాత్ర వహించి, రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేద్కర్ ఎంపీగా పోటీ చేస్తే, ఆయన్ను ఓడించాలని నెహ్రూ విస్తృతంగా ప్రచారం చేశారని, అదీ కాంగ్రెస్ పార్టీ సంస్కృతి అని విమర్శించారు. దక్షిణాది ప్రజలకు బీజేపీ మేలు చేస్తోందని.. తద్వారా వారి హృదయాల్లో చోటు సంపాదించి, ఇక్కడ కూడా జెండా ఎగరేస్తామని కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని భరోసానిచ్చారు. కాంగ్రె స్ ప్రచారాన్ని తిప్పి కొట్టి పార్లమెంట్ కు పంపించేలా మేధావులు కీలకపాత్ర పోషించారని గుర్తుచేసుకున్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అవమానపరిచేలా కాంగ్రెస్ వ్యవహారించిందని వాపోయారు. అధికారాన్ని నిలుపుకోవడం కోసం కాంగ్రె స్ పార్టీ రాజ్యాంగాన్ని అనుకూలంగా మార్చుకుందన్నారు. మొదటి న్యాయశాఖ మంత్రిగా పనిచేసిన అంబేద్కర్ రాజీనామా చేసేలా కాంగ్రెస్ వ్యవహరించిందన్నారు. అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితోనే బీజేపీ ప్రభు త్వం పనిచేస్తుందని చెప్పారు. రాజ్యాంగాన్ని మరింత శక్తిమంతంగా ఉండాలని మోదీ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. దేశానికి సేవ చేసిన అంబేద్కర్‌కు కాంగ్రెస్ భారతరత్న ఇవ్వకుండా అవమానించిదన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాకే అంబేద్కర్‌కి భారతరత్న ఇచ్చిందని గుర్తుచేశారు.

# సామాజిక కోణంలోనే నక్సలిజాన్ని చూస్తాం


శాంతిభద్రతల అంశంగా పరిగణించం.. శాంతి చర్చల కమిటీతో భేటీలో సీఎం



**హైదరాబాద్, ఏప్రిల్ 27:** నక్సలిజాన్ని తమ ప్రభుత్వం సామాజిక కోణంలో మాత్రమే చూస్తుందని, శాంతిభద్రతల అంశంగా పరిగణించబోదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరిపేలా చొరవ తీసుకోవాలని, కాల్పుల విరమణకు కేంద్రాన్ని ఒప్పించాలని కోరుతూ.. శాంతిచర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్, వైస్ చైర్మన్లు జంపన్న అలియాస్ జి.నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్, నేతలు ఆదివారం సాయంత్రం సీఎంను కలిశారు. పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని సీఎంకు అందించారు. దీనిపై మంత్రులతోనూ చర్చించి నిర్ణయం తీసుకుంటానని రేవంత్ చెప్పారు. గతంలో నక్సలైట్లతో చర్చలు జరిపిన అనుభవం సీనియర్ నేత జానారెడ్డికి ఉందని, దీనిపై ఆయన సలహాలు, సూచనలు తీసుకుంటామని వెల్లడించారు. మావోయిస్టులు శాంతి చర్చలకు వస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, నక్సలైట్ల వైపు నుంచి ఎలాంటి హింసాత్మక చర్యలూ లేనంతవరకూ రాష్ట్ర పోలీసు విభాగం నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండవని.. ఆయన తెలిపినట్టు సమాచారం. కాగా, మావోయిస్టులైనా, పోలీసులైనా, గిరిజనులు, ఆదివాసీలు, ఇలా ఎవరైనా.. ప్రాణం విలువ గొప్పదని, ప్రాణం పోతే తీసుకురాలేమని.. ప్రాణాలు కాపాడడానికి ప్రయత్నం చేయాలని.. సీఎంను కోరినట్టు చంద్రకుమార్ తెలిపారు. తమ విజ్ఞప్తులకు ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు.

# మంత్రి తుమ్మలతో జార్ఖండ్ మంత్రి శిల్పి నేహ భేటీ

రెండు రాష్ట్రాల్లో వ్యవసాయ పథకాలపై చర్చ



**హైదరాబాద్, ఏప్రిల్ 27:** రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను జార్ఖండ్ వ్యవసాయశాఖ మంత్రి శిల్పి నేహ తెలుసుకున్నారు. ఆదివారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ఆమె భేటీ అయ్యారు. ఇరువురు మంత్రులు పరస్పరం తమ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న రైతు పథకాలపై చర్చించారు. రాష్ట్రంలో అమలవుతున్న రైతు సంక్షేమ పథకాలను శిల్పి నేహకు మంత్రి తుమ్మల తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహంతోపాటు దాన్ని లాభదాయక పంటగా తీర్చిదిద్దడానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఇక వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధస్సు వినియోగం, కొత్త పథకాలు, రైతులకు లాభదాయకం చేసే విధానాల అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు హార్టికల్చర్ రంగం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, ఆ రంగ ఉత్పత్తులకు మార్కెటింగ్ పరిష్కారాలను వెల్లడించారు. రాష్ట్ర బడ్జెట్‌లో సింహభాగం రైతులకు కేటాయించామని, దేశంలో ఎక్కడా లేని విధంగా ఏకకాలంలో రూ.2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ పూర్తి చేశామని మంత్రి తుమ్మల చెప్పారు.



# నా మనసు కాలుతోంది... బాధ పడుతోంది

**ఎల్కతుర్తి:** అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న తెలంగాణను దేశంలోనే నంబర్ వన్‌గా చేసుకుంటే, ఏడాదిన్నర కాలంలోనే కాంగ్రెస్ పార్టీ నాశనం చేసిందని, అన్నిట్లోనూ ఫెయిల్ అయ్యిందని భారత్ రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ధ్వజమెత్తారు. మా అంత సిపాయిలు లేరు..కేసీఆర్‌కు మించి ఇస్తాం.. ఆరు చందమామలు తెచ్చి ఇస్తాం.. ఏడు సూర్యుళ్లు పెడతాం అని నమ్మబలికి ఓట్లు వేయించుకుని ప్రజలను దగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 420 హామీలిచ్చి ఏమీ చేయలేదని, మంచిగున్న తెలంగాణను ఆగం పట్టించారని విమర్శించారు. రైతుబంధు లాంటి పథకాలు కావాలని తననెవరూ అడగలేదని, మన ప్రజలను మనమే బాగు చేసుకోవాలని ఆ పథకాలను అమలు చేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తాము పడగొట్టబోమని, ప్రజలే వీపులు సాపు చేస్తారని వ్యాఖ్యానించారు. ఆనాడైనా, ఈనాడైనా తెలంగాణకు కాంగ్రెస్సే నంబర్ వన్ విలన్ అని అన్నారు. కాంగ్రెస్‌ను గద్దె దించేందుకు ఇక తాను బయటకు వస్తానని ప్రకటించారు. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు. బీఆర్ఎస్ (టీఆర్ఎస్) ఆవిర్భవించి 25 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఆదివారం వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన రజతోత్సవ సభలో ఆయన ప్రసంగించారు.

## అప్పుడెంత బాగుండె.. ఇప్పుడెట్లయింది?

'ఒక ఊరిలో నాట్లు వేసే టైమ్ వస్తే వడ్లు ఓ రైతు అలుకుతున్నడు. మొలకకు అలుకుడు చేస్తం కదా.. పెద్ద మొగోడు అని ఒకర్ని మొలక అలికేందుకు పిలిస్తే.. ఎలుక పిల్లను చూసి ఎల్లెలకల పడ్డడట. అట్లనే మా అంత సిపాయిలు లేరు.. మేం తెచ్చి ఇస్తాం అన్నరు. ఇవాళ మమ్మల్ని నమ్ముతలేరు.. అప్పు పుడుతలేదని మాట్లాడుతుండ్రు. ఎక్కడికెళ్లి తెచ్చి చేయాలని అంటున్నరు. అపారమైన అనుభవం ఉందని అప్పుడు అన్నరు.. ఇప్పుడేమో ఎల్లెలకల పడుతుండ్రు. నా ప్రసంగం టీవీల్లో వినే కోట్లాను కోట్ల మందిని అడుగుతున్నా.. ఇంత మోసం ఉంటదా.. ఇంత దగా ఉంటదా..? ఎంత వరకు ఇది కరెక్ట్..? తెలంగాణను బొందల పడగొట్టిండ్రు.. ఎంత ఘోరమైన ఫలితం చూస్తున్నాం.

## బుక్కులు పంచిండ్రు.. బాండ్లు రాసిచ్చిండ్రు

హామీలు ఇచ్చుడు కాదు.. పెద్ద పెద్ద బుక్కులు ఊరూరా పంచిండ్రు. సిగ్గు లేకుండా బాండ్ పేపర్లు రాసిచ్చిండ్రు. అడ్డగోలుగా హామీలు ఇచ్చిండ్రు..యేడికెళ్లి ఇస్తారని కాంగ్రెస్ నేతలను అడిగితే.. చేసి చూపిస్తాం.. మాది పెద్ద పార్టీ.. మమ్మల్ని మించిన సిపాయిలు లేరని ఇప్పుడు ఆర్థికమంత్రిగా ఉన్నాయన జబ్బలు చరిచాడు.. ఒకడు మెడలు చరిచాడు. డైలాగులు మీద డైలాగులు కొట్టారు. మధ్యలో ఎంపీ ఎలక్షన్లు వచ్చాయి.. నాకు కాలు విరిగింది.. అయినా నేను బయల్దేరాను.. దీంతో తెలంగాణలో ఎంత మంది దేవుళ్లు ఉంటే అంతమంది దేవుళ్ల మీద ఒట్లు పెట్టిండ్రు. ఇన్ని మాటలు చెప్పి మోసం చేసిన్రు. ఉచిత బస్సు అని పెడితే జుట్లు పట్టుకుని కొట్టుకునేందుకు పనికి వస్తోంది తప్ప ఉపయోగం లేదు. ఈ ఉచిత బస్సు మాకు అవసరం లేదు అని ఆడబిడ్డలు అంటున్నరు. ఊ అంటే ఆ అంటే అబద్ధాలు చెబుతున్నారు. నమ్మి బోల్తా పడ్డం..' అని కేసీఆర్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఎంత బాగుండె. ఇప్పుడెట్లయింది? నా మనసు కాలుతుంది. బాధయితంది. దుఃఖం వస్తోంది. కేసీఆర్ పక్కన పోంగనే ఇంత ఆగమయితదా? ఎందుకు ప్రజల గోస పోసుకుంటున్నరు? కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు భూముల ధరలు ఎట్లుండె. కొనేటోళ్లు ఎక్కువుండె. అమ్మేటోళ్లు తక్కువుండే. నేను 24 గంటలు కరెంటు ఇయ్యలేదా? ఇప్పుడు ఎందుకు ఇయ్య శాతనయిత లేదు? మళ్లీ తెల్లందాక కరెంటు పెట్టడానికి పోవాల్నా..? మంచినీళ్లు కూడా ఇయ్య శాతనయితలేదు. కానీ మేం ఇంత సిపాయిలం, అంత సిపాయిలం అంటున్నరు..' అని కేసీఆర్ ఎద్దేవా చేశారు.

## తెలంగాణ బిడ్డలను పిట్టల్లా కాల్చారు

'ఆనాడైనా, ఏనాడైనా, ఈనాడైనా తెలంగాణకు విలన్ నంబర్ వన్ కాంగ్రెస్ పార్టీ. తెలంగాణ హైదరాబాద్ స్టేట్ పేరుతో ఉన్ననాడు.. ప్రజలు వద్దంటే కూడా బలవంతంగా తెలంగాణను ఆంధ్రాతో కలిపింది కాంగ్రెస్ పార్టీ, జవహర్‌లాల్ నెహ్రూ. 1969లో తెలంగాణ ఉద్యమం వస్తే.. 400 మంది తెలంగాణ బిడ్డలను పిట్టల్లా కాల్చి చంపింది ఇందిరాగాంధీ ప్రభుత్వం.. ఆనాడు ఉన్నటువంటి కాంగ్రెస్ పరిపాలన. 2001 నుంచి గులాబీ పార్టీ పెట్టి విజృంభిస్తే.. నంగనాచిలాగా ఇదే కాంగ్రెస్ వచ్చి.. మన బలాన్ని, మన ఊపును చూసి పొత్తు పెట్టుకుని తెలంగాణ ఇస్తమని నమ్మబలికిన్రు. మళ్లీ ఎగ్గొట్టే ప్రయత్నం చేసిన్రు. 14 సంవత్సరాలు ఏడిపించిన్రు. జయశంకర్ సార్‌తో కలిసి పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు కాంగ్రెస్ గొంతు పట్టుకుంటే.. అప్పుడు దిగివచ్చి తెలంగాణ కోసం ప్రకటన చేసిన్రు. మళ్లీ వెనక్కి వెళ్లారు.

## ఎన్నెన్ని చెప్పిరి.. ఏమన్నా చేసిన్రా?

'కాంగ్రెస్ సర్కార్ వచ్చి ఏడాదిన్నరయ్యింది.. ఏ మాయ రోగం వచ్చె..ఏం బీమారి వచ్చె.. ఏమేం చెప్పిరి.. ఎన్నెన్ని చెప్పిరి.. గోల్‌మాల్ దింపుట్ల, అబద్ధాలు చెప్పుట్ల కాంగ్రెస్‌ను మించినోళ్లు లేరు. ఇక్కడ ఉన్నోళ్లు చాలరని చెప్పి ఉన్న గాంధీలు, లేని గాంధీలు, డూప్లికేట్ గాంధీలు ఢిల్లీకెళ్లి దిగిరి. స్టేజీల మీద డ్యాన్స్‌లు చేసిన్రు. కేసీఆర్





రైతుబంధు కింద ఏం ఇస్తుండు..రూ.10 వేలు ఇస్తుండు.. మేం రూ.15 వేలు ఇస్తమని చెప్పిన్రు. పెన్షన్లు రూ.2 వేలు ఇస్తుండు మేం వస్తే రూ.4 వేలు ఇస్తమని చెప్పిరి. ఇద్దరు ఉంటే కేసీఆర్ ఒక్కరికే ఇస్తుండు.. మేం ముసలిది ముసలోడికి ఇద్దరికీ ఇస్తమనిరి. దివ్యాంగులకు రూ.4 వేలు ఇస్తుండు.. మేం రూ.6 వేలు ఇస్తమన్నరు. ఆడపిల్లలకు స్కూటీలు కొనిస్తమన్నరు. విద్యార్థులకు ఐదు లక్షల గ్యారంటీ కార్డు ఇస్తమని చెప్పిరి. ఇక ఒకరెనుక ఒకరు ఉరికి.. రూ.2 లక్షల లోన్ తెచ్చుకోండి.. డిసెంబర్ 9న ఒక్క కలం పోటుతో ఖతం చేస్తం అన్నరు. కల్యాణలక్ష్మి కింద కేసీఆర్ లక్షా నూటపదహార్లు ఇస్తున్నడు.. మేం తులం బంగారం కలిపి ఇస్తామని చెప్పిండ్రు. 420 హామీలు ఇచ్చిన్రు. ఏమన్నా చేసిన్రా .. ఏం చేయలేదు. మాట్లాడితే బీఆర్ఎస్, కేసీఆర్ మీద నిందలు వేస్తున్నారు. ఆ తర్వాత సకల జనుల సమ్మె కావొచ్చు. సాగర హారాలు కావొచ్చు. వంటావార్పులు కావొచ్చు.. అనేక రూపాల్లో విజృంభించి భీకరమైన పోరాటం చేశాం. మూడేళ్ల తర్వాత రాజకీయ అవసరం ఏర్పడి ఆనాడు మళ్లీ తెలంగాణ ఇస్తామని ప్రకటించారు. వారికి ఇష్టం లేకపోయినా తెలంగాణ సృష్టించిన సుడిగాడుపులు తట్టుకోలేమని తెలంగాణ ఇచ్చిన్రు..' అని మాజీ సీఎం గుర్తు చేశారు.

# సోనియాకు సాష్టాంగ నమస్కారం మరిచారా?

(మొదటి పేజీ తరువాయి)

అని ప్రశ్నించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టి, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు ఇవ్వట్లేదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అన్ని అంశాలపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమా? అని కేసీఆర్‌కు సవాల్ విసిరారు. ఆదివారం సీఎం రేవంత్ నివాసం వద్ద మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, సీతక్కలతో కలిసి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు దళితుడిని సీఎం చేయలేకపోయిన కేసీఆర్.. ఇప్పుడు కనీసం ప్రతిపక్ష నేత హోదా అయినా దళితుడికి ఇచ్చి ఉండవచ్చు కదా అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే కాంట్రాక్టర్లు, సర్పంచ్‌లకు ప్రభుత్వ బకాయిలు పేరుకుపోయాయని చెప్పారు. 80 వేల పుస్తకాలు చదివిన కేసీఆర్.. ఆ జ్ఞానాన్ని అసెంబ్లీలో ప్రదర్శిస్తారనుకున్నామని, కానీ రాలేదని ఎద్దేవా చేశారు. "బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని కేసీఆర్ కలలు కంటున్నారు. కేసీఆర్ హయాంలో కాంగ్రెస్ పార్టీ సభలకు రాకుండా ఆటోడ్రైవర్లను, ప్రైవేటు టాక్సీ డ్రైవర్లను ఇబ్బంది పెట్టారు. ఆర్టీసీ బస్సులు అద్దెకు తీసుకోనివ్వకుండా చేశారు. మేమూ అలా ఇబ్బంది పెట్టాలనుకుంటే కేసీఆర్ సభ జరిగి ఉండేదే కాదు.." అని పొంగులేటి స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడి, ట్యాపింగ్ చేసిన వారిని విదేశాల్లో ఉంచి డ్రామాలాడుతున్న కేసీఆర్‌కు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతికత లేదని విమర్శించారు. ఔటర్ రింగ్ రోడ్డును దగ్గరి వాళ్లకు లీజుకు ఇచ్చుకున్నదెవరని.. మద్యం దుకాణాల టెండర్లను ముందే ఎందుకు పిలిచారని ప్రశ్నించారు. ఒక నియంత తన అధికారాన్ని కోల్పోయిన తర్వాత మాట్లాడినట్టుగా కేసీఆర్ ప్రసంగం ఉందని మంత్రి సీతక్క విమర్శించారు. వారి కుటుంబంలో చీలికలు పెరుగుతున్నాయన్న బాధ కేసీఆర్‌లో కనిపించిందని పేర్కొన్నారు. కేసీఆర్ బిడ్డ కవిత ఖరీదైన కార్లలో తిరగొచ్చుగానీ.. పేద మహిళలు ఆర్టీసీ బస్సుల్లో తిరగొద్దా? అని నిలదీశారు. అసెంబ్లీ సమావేశాలను సొల్లు కబుర్లంటూ అవమానించిన కేసీఆర్‌కు.. మళ్లీ అసెంబ్లీకి వచ్చే అర్హత ఉందా? అని నిలదీశారు. మరి ఆయన కొడుకు, అల్లుడిని అసెంబ్లీకి ఎందుకు పంపుతున్నారని ప్రశ్నించారు.

## ఆ మాటలు ఉపసంహరించుకోవాలి: పొన్నం

తెలంగాణ పాలిట విలన్ కాంగ్రెస్ పార్టీ అన్న కేసీఆర్ మాటలను ఉపసంహరించుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోనియాగాంధీ తప్ప తెలంగాణ రాష్ట్రాన్ని ఎవరూ ఇవ్వలేరన్న సంగతి కేసీఆర్‌కు తెలుసని చెప్పారు. సోమవారం అన్ని జిల్లా కేంద్రాల్లో సోనియా గాంధీ చిత్రపటాలకు పాలతో అభిషేకం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## కేసీఆర్ ఇంట్లో వేల కోట్లు: జూపల్లి

కేసీఆర్ హయాంలో జరిగిన రుణమాఫీ వడ్డీలకే సరిపోలేదని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. అక్షయపాత్ర లాంటి ఔటర్ రింగ్ రోడ్డును కేసీఆర్ అమ్ముకున్నారని ఆరోపించారు. అధికారం పోయినా కేసీఆర్‌లో గర్వం పోలేదని విమర్శించారు. కేసీఆర్ ఇల్లును సోదా చేస్తే రూ. వేల కోట్లు దొరుకుతాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సభలో కేసీఆర్ ప్రసంగంలో స్వయం డబ్బా, పరనింద తప్ప ఏమీ లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఒక ప్రకటనలో విమర్శించారు.

# మా వాళ్లు కరెక్ట్‌గా లేకే అధికారంలోకి రాలేదు: రాజాసింగ్

**హైదరాబాద్:** గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ వాళ్లు కరెక్ట్‌గా లేకే అధికారంలోకి రాలేదని గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ తెలిపారు. అయితే వచ్చే ఎన్నికల్లో వచ్చేది మాత్రం కచ్చితంగా బీజేపీనేనని ధీమా వ్యక్తం చేశారు. ఎల్కతుర్తి సభలో కేసీఆర్ ప్రసంగించిన అనంతరం అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీ కూడా స్పందించింది. దీనిలో భాగంగా మాట్లాడిన రాజాసింగ్.. ' సభలో కేసీఆర్ ఆడిన ప్రతి మాట అబద్ధం. పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్రానికి పది లక్షల కోట్ల రూపాయిలు ఇచ్చింది. తెలంగాణ అభివృద్ధి కేంద్ర నిధులతోనే జరిగింది. కేసీఆర్ ఫాంహౌస్ లో మంచిగా ఉన్నారు. మీరు అక్కడ ఉంటేనే మంచిది.కేసీఆర్ రాష్ట్రాన్ని మత్తుగా మార్చారు. తెలంగాణ అంటే బార్ అండ్ రెస్టారెంట్ గా మార్చారు. తెలంగాణ రాష్ట్రం డబుల్ ఇంజిన్ సర్కారుతోనే జరుగుతుంది' అని రాజాసింగ్ స్పష్టం చేశారు.

# నూతన సీఎస్‌గా రామకృష్ణారావు

తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ఆర్థిక శాఖ బాధ్యతలు.. ఆర్థిక శాఖలో తనదైన ముద్ర.. 13 బడ్జెట్ల రూపకల్పనలో భాగం.. విధానాల రూపకల్పనలో దిట్ట.. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బాధ్యతలు కూడా



**హైదరాబాద్, ఏప్రిల్ 27:** రాష్ట్ర నూతన సీఎస్ నియామకంపై కొద్దిరోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావును రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా తదుపరి ఉత్తర్వులు జారీచేసేంత వరకు ప్రస్తుతమున్న ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బాధ్యతలను కూడా చూసుకోవాలని ప్రభుత్వం మరో ఉత్తర్వులో పేర్కొన్నది. ప్రస్తుత సీఎస్ ఏ శాంతికుమారి ఈనెల 30న పదవీ విరమణ చేయనున్న విషయం విధితమే.



# వంజరికుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి....

**ఎస్టీలుగా పునరుద్ధరించాలి..**

**తెలంగాణ వంజరి సంఘం డిమాండ్...**

సికింద్రాబాద్, ఏప్రిల్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ వంజరి కులస్తుల సామాజిక ఆర్థిక అభివృద్ధి కొరకు వెంటనే కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ వంజరి సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆదివారం తార్నాక లోని రాష్ట్ర వంజరి సంఘ కార్యాలయంలో వంజరి కులస్తుల సమాలోచన సమావేశం పలు అంశాలపై తీర్మానాలు చేసింది.అనంతరం తెలంగాణ వంజరి సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు కాలేరు విశ్వనాథం మాట్లాడుతూ ఉప్పల్ భగాయత్ లో తెలంగాణ వంజరి ఆత్మగౌరవ భవన నిర్మాణం కు ప్రభుత్వము నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే ఐదు కోట్ల రూపాయల నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నివసిస్తున్న వంజరి కులస్తులు కోల్పోయిన ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్యవర్గం పదవీకాలం ముగిసినందున వెంటనే ఎన్నికలు నిర్వహించాలని అందుకు సహకార శాఖ వెంటనే జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షులు సాల్వేరు ముత్తయ్య, మైసరి మాణిక్ ప్రభు, సలహాదారులు కాలేరు సురేందర్, భానుక ఆంజనేయులు, అఖిల భారత వంజరి సంఘం ఉపాధ్యక్షులు సాల్వేరు కృష్ణ, తెలంగాణ వంజరి సేవా సంఘం ఉపాధ్యక్షులు ఎదుగని హరినాథ్, రిజర్వేషన్ కమిటీ చైర్మన్ ముజకరి రవీందర్, కార్యదర్శి పోతాను కార్ లక్ష్మీనారాయణ, తెలంగాణ వంజరి సంఘం ఉపాధ్యక్షులు ఆముద్ద విజయ్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లవంగు ఆంజనేయులు, దాత్రిక కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# జవహర్ బాల్ మంచ్ తెలంగాణ
## - రాష్ట్ర స్థాయి పిల్లల సదస్సు



కూకట్‌పల్లి: ఏప్రిల్ 27(వాయిస్ టుడే): జవహర్ బాల్ మంచ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మామిడి రిషికేశ్ రెడ్డి అధ్యక్షతన, జవహర్ బాల్ మంచ్ రాష్ట్ర కోఆర్డినేటర్ మరియు ప్రోగ్రాం కన్వీనర్ జిట్టా సునీల్ కుమార్ యాదవ్ సమక్షంలో జవహర్ బాల్ మంచ్ రాష్ట్రస్థాయి పిల్లల శిక్షణ సదస్సును గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. జవహర్ బాల్ మంచ్ జాతీయ అధ్యక్షులు జి. వి హరి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, జవహర్ బాల్ మంచ్ జాతీయ ప్రతినిధి తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ ఫెన్ రస్సెల్ ముఖ్య అతిథులుగా విచ్చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సదస్సు లో మొట్టమొదటి జవహర్ బాల్ మంచ్ తెలంగాణ, పిల్లల కమిటీలకు ఎన్నికలు నిర్వహించి వారి జాబితాను ప్రకటించారు. పిల్లల కమిటీ అధ్యక్షులు గా సంతోష్, వైస్ ప్రెసిడెంట్ పునీత్, అంబటి సుచరిత ను ఎన్నుకున్నారు. ఈ సదస్సులో ముఖ్యంగా రాజ్యాంగం వాటి లక్ష్యాలు- ఆశయాలు- స్ఫూర్తిని, పంచాయతీరాజ్ వ్యవస్థ, స్థానిక సంస్థలు, పర్సనాలిటీ మరియు స్కిల్ డెవలప్ మెంట్ తదితర అంశాల మీద పిల్లలకు అవగాహన కోసం ఒక రోజంతా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. జవహర్ బాల్ మంచి పిల్లల యొక్క లక్ష్యాన్ని చేరుకోవడానికి ఒక సంధానకర్తలాగా పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా అధ్యక్షులు రిషికేశ్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కోఆర్డినేటర్లు శివరాజ్, ప్రవీణ్ బాబు,కిరణ్, అంబటి తులసి, రాంబాయి, అభిషేక్, సాయి కృష్ణ, బాల్య నాయక్, జిల్లా చీఫ్ కోఆర్డినేటర్లు సైదేశ్వర రావు, సుదర్శన్, సునీల్, విదుర్ చావ్లా, కోదరి వెంకటేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాల నుండి తితిలి యూనిట్ లోని పిల్లలు 200 మంది పైగా పాల్గొని ఈ సదస్సును విజయవంతం చేశారు.




# టీవీ చానల్స్‌లో మతపరమైన డిబేట్ లను ఆపాలి

**పాస్టర్ ప్రవీణ్ హత్యకు కూటమి ప్రభుత్వం కారణం...**

**నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ఇండియన్ క్రిస్టియన్..**

సికింద్రాబాద్, ఏప్రిల్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి): బెట్టింగ్ యాప్లను ఎలాగైతే నిషేధించారో అదేవిధంగా టీవీ చానల్స్ లో మతపరమైన ఓపెన్ డిబేట్ల ను నిషేధించాలని ది నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ఇండియన్ క్రిస్టియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు పాస్టర్ ప్రవీణ్ మరణాన్ని నిరసిస్తూ ఆదివారం రాత్రి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ది నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ఇండియన్ క్రిస్టియన్స్, గ్లోబల్ అలయన్స్ ఆఫ్ క్రిస్టియన్స్ లీడర్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంస్థల అధ్యక్షులు డేవిడ్ శాంతరాజ్, సి.ఏ డేనియల్ ఆడమ్స్ మాట్లాడుతూ.. పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణానికి ఆంధ్రప్రదేశ్లో ఉన్న కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలని సమగ్రమైన రీ పోస్టుమార్టం నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే నేరపూరిత కుట్ర వెనుక ఉన్న సత్యాన్ని వెలుగు తీసేందుకు ఉన్నత స్థాయి న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. టీవీ ఛానల్ యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్న డిబేట్లో మతపరమైన అంశాల వల్ల మనుషుల మధ్యలో విభేదాలు సృష్టించబడుతున్నాయని అవి హత్యలు వరకు దారితీస్తున్నాయని వెంటనే తెలుగు రాష్ట్రాల్లో మతపరమైన డిబేట్లను నిషేధించాలని డిమాండ్ చేశారు. మరి కొంతమంది పాస్టర్లు అంతం చేయాలని కుట్ర పెద్ద ఎత్తున జరుగుతుందని పాస్టర్ అజయ్ బాబుకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిడి వెంకట్ రాజ్, జేసు సాలెం ముత్తయ్య, విశాల్ స్వామి దాస్, ఇస్నేల్ పోచన్న, సాలమన్ ఎస్ రాజ్, జాషువా డానియల్, మాణిక్యం అబ్రహం తదితరులు పాల్గొన్నారు.



# సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో ఆర్పీఎఫ్ పోలీసుల తనిఖీలు

సికింద్రాబాద్, ఏప్రిల్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి): కశ్మీర్లో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో రైల్వేపోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రయాణీకుల భద్రత , రైల్వే కార్యకలాపాలు సజావుగా జరిగేలా నివారణ చర్యలు తీసుకున్నారు. ముందస్తు జాగ్రత్తచర్యల్లో భాగంగా ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు ఆదివారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్లో విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా స్టేషన్‌లోని వివిధ కీలక ప్రాంతాలలో సమగ్ర తనిఖీలో భాగంతా స్టేషన్లోవెయిటింగ్ హాళ్లు, సర్క్యులేటింగ్ ఏరియా, రైళ్లు ప్లాట్‌ఫారమ్‌లను తనిఖీ చేశారు. స్టేషన్లో ప్రయాణీకుల సామాగ్రిని చెక్ చేశారు.అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులపై ఆరా తీశారు. స్టేషన్ డాగ్ బ్లేజ్ సహాయంతో వెయిటింగ్ హాళ్లు, ప్లాట్‌ఫారమ్‌లు, పార్శిల్ ఆఫీస్ , రైళ్లలో పేలుడు వస్తువుల కోసం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సమయంలో అనుమానాస్పద వస్తువులు ఏవీ కనుగొనలేదు.

# సమాజానికి అద్దంపట్టే కథలు: ప్రొఫెసర్ కాసిం

## గాజులు కొనని రోజున కథల సంపుటి ఆవిష్కరణ



సికింద్రాబాద్, ఏప్రిల్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి): యువకవి, రచయిత, కథకుడు కె.పి.లక్ష్మినరసింహ రచించిన కథలు సమాజానికి అద్దం పట్టేలా ఉంటాయని ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాసిం చెప్పారు. కథల సంపుటి గాజులు కొనని రోజున ను ఆవిష్కరించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేంద్రం సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డా.పసునూరి రవీందర్ అధ్యక్షతన జరిగిన ఆవిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ కాశీం హాజరై మాట్లాడారు. కెపి లక్ష్మి నరసింహ కథలు జీవితాల నుంచి వచ్చిన వని తెలిపారు. సమాజాన్ని పుట్టి పీడిస్తున్న అనేక సమస్యల్ని లక్ష్మి నరసింహ కథల ద్వారా తెలియజేశాడని అన్నారు. ప్రముఖ కవయిత్రి కొల్లాపురం విమల మాట్లాడుతూ సమాజంలో ఉన్న అనేక సమస్యలకు లక్ష్మి నరసింహ మంచి పరిష్కారాలు చూపారని తెలిపారు. ప్రముఖ చరిత్ర పరిశోధకులు సంగిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేద్కర్ ఐడియాలజీతో మంచి కథలు రాస్తున్న యువకుడు లక్ష్మి నరసింహ అని తెలిపారు. ఈ కథా సంపుటిని డా. సిద్దెంకి యాదగిరి పరిచయం చేశారు. ఈ సమావేశంలో ప్రముఖ కథకుడు, విమర్శకులు వెల్దండి శ్రీధర్, తెలంగాణ సాహితి రాష్ట్ర ఉపాధ్యక్షులు అనంతోజు మోహన్ కృష్ణ, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీతలు తగుళ్ల గోపాల్, రామేష్ కార్తీక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# రాందేవ్ ఆసుపత్రి సేవలు అద్భుతం

**మున్సిపల్ కార్మికులకు వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం**

**కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు: శేరి సతీష్ రెడ్డి**

కూకట్‌పల్లి, ఏప్రిల్ 27(వాయిస్ టుడే) కూకట్ పల్లి ప్రాంతంలో రోగులకు విశేష సేవ అందిస్తున్న రాందేవ్ ఆసుపత్రి సేవల అద్భుతం అని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి అన్నారు. ఆదివారం రాందేవ్ ఆసుపత్రిలో మున్సిపల్ కార్మికుల మెగా వైద్య శిబిరం కార్యక్రమంలో స్కానింగ్ విభాగాన్ని శేరి సతీష్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాందేవ్ ఆసుపత్రి రోగులకు సేవలు అందిస్తూనే సమాజానికి సేవలు అందిస్తున్న జర్నలిస్టులు, పోలీసులతో పాటు మున్సిపల్ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం ద్వారా రోగాల నిర్ధారణ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయడం హర్షించదగ్గ పరిణామం అన్నారు. సమాజ హితానికి కృషి చేస్తున్న రాందేవ్ ఆసుపత్రి వైద్య సారథులు డాక్టర్ కమలాకర్ రావు, సీఈవో డాక్టర్ యోబు లతోపాటు వైద్య బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ మేకల మైఖేల్, కెపిహెచ్బి డివిజన్ ప్రెసిడెంట్ తమ్మినేని ప్రవీణ్ కుమార్,కొమ్ము బాబు, రామకృష్ణారెడ్డి, గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు..



## మెగా ఉచిత వైద్య శిబిరంలో ఇసీజీ, ఎక్స్రే విభాగాలను ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్, జీవీఆర్

కూకట్‌పల్లి, ఏప్రిల్ 27(వాయిస్ టుడే) : కూకట్‌పల్లి నియోజకవర్గం లోని రాందేవ్ రావు హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్ సీఇ డాక్టర్ యోబు ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు, రూ.10లక్షల రూపాయల ఉచిత మెడిసిన్స్ ను, 2500 మంది జీహెచ్ఎంసీ కార్మికులకు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఎక్స్ రే వార్డ్ ను ప్రారంభించారు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు ఇసీజీ -2డి ఇసీహెచ్ఓ వార్డ్ ను ప్రారంభించారు. ఈ సందర్బంగా బండి రమేష్ మాట్లాడుతు ఇంత పెద్ద మెగా హెల్త్ క్యాంపు ను నిర్వహిస్తున్న హాస్పిటల్ నిర్వహకులను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## రాందేవ్ రావ్ హాస్పిటల్లో ఉచితం మెగా హెల్త్ క్యాంపును ప్రారంభించిన జనసేన నాయకుడు ప్రేమ్ కుమార్

కూకట్‌పల్లి, ఏప్రిల్ 27(వాయిస్ టుడే): కూకట్ పల్లి నియోజకవర్గం జీహెచ్ఎంసి సానిటరీ మరియు ఆశా వర్కర్స్ కొరకై రాందేవ్ రావ్ హాస్టల్లో ఉచిత హెల్త్ క్యాంప్ నకు హాస్పటల్ సీఈవో యోబు ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా కూకట్ పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ పాల్గొని మెగా హెల్త్ క్యాంపు ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ రాందేవ్ రావు హాస్పటల్ యాజమాన్యం జీహెచ్ఎంసి వర్కర్స్ మరియు ఆశా వర్కర్స్ ప్రతి మనిషికి సుమారు రూ.40,000 రూపాయల విలువైన వైద్య పరీక్షలు చేస్తున్నందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామ్ దేవరావు హాస్పిటల్ మేనేజర్ కల్పన, కూకట్ పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్ కలిగినీడి ప్రసాద్, పులగం సుబ్బు తదితరులు పాల్గొన్నారు.



## ఉగ్ర దాడిని వ్యతిరేకించిన స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్

సికింద్రాబాద్, ఏప్రిల్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి): పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన భారత పర్యాటకుల ఆత్మకు శాంతి కలగాలని అమరవీరుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రోజు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ నుండి ఎన్సిసి గేట్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ యాక్టివ్ వింగు సభ్యులు మాట్లాడుతూ దేశ ఐక్యమత్యాన్ని శాంతిని దెబ్బతీసే ఏ విషయాన్ని అయినా తీవ్రంగా ఖండించాలని, రాజకీయాలకి కుల మతాలకి అతీతంగా ఖండించి దేశం మొత్తం ఏకధాటిగా నడవాలన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం శాంతియుత వాతావరణాన్ని కాశ్మీర్లో సృష్టించే విధంగా బలమైన చర్యలు చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే దేశ రక్షణ కోసం ఏ చర్యనైనా అందరూ ఏకతాటిగా మద్దతు ప్రకటించాలని మీడియాతో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ ఎఫ్ అడ్వైజర్ వంగూరి దామోదర్, ప్రెసిడెంట్ శాగంటి రాజేష్, శలికంటి వినోద్ కుమార్, జక్కుల వెంకటేష్ యాదవ్, అన్వేష్, లెనిన్, బీరప్ప, వంశీ, సురేష్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
సోమవారం, 28 ఏప్రిల్ 2025



## మేడే సాక్షిగా సమస్యల పరిష్కారం కోసం ప్రతిన బూనుదాం

### బెజవాడ రవిబాబు

మధిర,ఏప్రిల్ 27 ( వాయిస్ టుడే ): ప్రపంచ కార్మికుల పర్వదినం మేడే సాక్షిగా పేదలు,కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంకోసం,కార్మికుల హక్కుల పరిరక్షణకోసం పోరాడతామని ప్రతిన బూనాల్సిన అవసరం ఏర్పడిందని, భవిష్యత్తులో జరుగబోయే పోరాటాలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెదవాడ రవిబాబు పిలుపునిచ్చారు.ఆదివారం సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం శిలువేరు శ్రీనివాసరావు అధ్యక్షతన ఆర్టీసీ యూనియన్ కార్యాలయంలో జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు,సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు మాట్లాడుతూ,కార్మికులు,పేద ప్రజల పక్షాన నిల్చున్నది ఎర్రజెండానేనని,వారికి అనేక హక్కులు,సౌకర్యాలు సాదించి పెట్టింది ఎర్రజెండానేనని అన్నారు.కార్మికులు అనుభవిస్తున్న ప్రతి హక్కు వెనుక సిపిఐ పోరాటం ఉందని అన్నారు.గ్రామీణ పేదలకు ఉపాధి హామీ చట్టం సాధించి పెట్టింది కమ్యూనిస్టులేనని అన్నారు.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల చట్టాలని,హక్కులను కాలరాసే చర్యలకు పాల్పడుతోందని దీని గ్రామీణ కార్మికులు,ప్రజలు వ్యతిరేకించి కమ్యూనిస్టు పార్టీ నిర్వహిస్తున్న పోరాటాల్లో కలసిరావాలని పిలుపునిచ్చారు.మేడే సందర్భంగా అన్ని గ్రామాల్లో,కార్మిక క్షేత్రాల్లో జెండావిష్కరణలు జరపాలని, సదస్సులు,సమావేశాలు,ర్యాలీలు నిర్వహించి చికాగో అమరవీరుల స్ఫూర్తిని ప్రజల్లో నింపాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్ళపల్లి ప్రకాశరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్,ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి చెరుకూరి వెంకటేశ్వరరావు,సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి మంగళగిరి రామాంజనం,తలారి రమేష్, ఏఐటీయూసీ నాయకులు ఊట్ల రామకృష్ణ,అన్నవరపు సత్యనారాయణ,జల్లా బ్రహ్మం, నరసింహారావు, నాయకర్,పొన్నవెల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన హస్తకళల అభివృద్ధికి కలెక్టర్ జితేష్.వి.పాటిల్, ప్రత్యేక కార్యాచరణ

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఏప్రిల్ 27: గుల్లాకారి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుష్మిత కనేరి జిల్లా పర్యటనలో నాయకపోడ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ యూనిట్ పరిశీలన, అభివృద్ధి మార్గదర్శకంపై చర్చ.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్.వి.పాటిల్, ఆదేశాల మేరకు, జిల్లాలో గిరిజన సంప్రదాయ హస్తకళల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టబడుతోంది.

ఈ కార్యక్రమంలో భాగంగా, గుల్లాకారి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుష్మిత కనేరి ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటన చేపట్టారు. ఆమె ముందుగా జిల్లా కలెక్టర్ జితేష్.వి.పాటిల్ ను కలుసుకుని, గిరిజన హస్తకళల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శక ఆదేశాలు తీసుకున్నారు. తదనంతరం, ములకలపల్లి మండలంలోని మాదారం గ్రామంలో ఏర్పాటు చేసిన నాయకపోడ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ యూనిట్‌ను పరిశీలించారు. ఇక్కడి గిరిజన కళాకారులు రూపొందిస్తున్న సంప్రదాయ హస్త కళాకృతుల తయారీని, నైపుణ్యాలను ప్రత్యక్షంగా సమీక్షించారు. యూనిట్ పరిశీలన అనంతరం, సుష్మిత కనేరి కలెక్టర్ జితేష్.వి.పాటిల్ తో గిరిజన కళాకారుల నైపుణ్యాభివృద్ధి, మార్కెట్ లింకేజ్, ఉత్పత్తుల బ్రాండింగ్, ప్రాచుర్యం కోసం తీసుకోవలసిన చర్యలపై విశ్లేషణాత్మకంగా చర్చించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గిరిజన సంపదను ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా చేయడానికి కలెక్టర్ ప్రణాళికాబద్ధంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకయ్య ఏపిఎం ( ఫామ్), డి ఆర్ డి ఓ కార్యాలయం, హరి కృష్ణ, జేడీఎం ఐటిడిఏ అంజన్, నాయకపోడు, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, మాదారం. పాల్గొన్నారు.

## పెహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల నిరసన ర్యాలీ

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఏప్రిల్ 27: ఆదివారం న సెయింట్ పీటర్ చర్చ్, సంఘం వారు ఆదివారం ఆరాధన అనంతరం సెయింట్ పీటర్ చర్చ్ సంఘ కాపరి పి.అనిల్ కుమార్, సెక్రెటరీ రవి రత్నరాజు ఆధ్వర్యంలో ఇటీవల జమ్మూ-కాశ్మీర్ పెహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల నిరసన ర్యాలీని నిర్వహించారు. ఉగ్రవాదూల దాడిలో భారతీయులు నేపాల్ దేశస్తులు ఉన్నారని ఉగ్రవాదులు అన్యాయంగా పర్యాటకులను కాల్చి చంపారని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటువంటి దాడులు చాలా బాధాకరమని అన్నారు. ఈ ర్యాలీలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు పాల్గొన్నారు.



# దుర్మార్గపు చర్యను ఖండించిన అడ్వకేట్ సాదిక్ షేక్

## ఇస్లాంను, ముస్లింలను, టార్గెట్ చేయడం దారుణం

ఖమ్మం , ఏప్రిల్ 26 (వాయిస్ టుడే ): జమ్మూ కాశ్మీర్ పహల్గాం లో పాకిస్తాన్ ముష్కరుల దాడిని ఒక సామాజిక వర్గానికి, మతానికి ఆపాదించి అమాయక ముస్లిం మైనారిటీలను టార్గెట్ చేయడం దాడులకు పాల్పడటం, హింసించడం తగదని, అడ్వకేట్ సాదిక్ షేక్ కోరారు.

పహల్గాం లో ముష్కరుల దాడిని కుల మతాలకు రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ ఖండిస్తున్నా, కొందరు ఇస్లాంను, ముస్లిం లను టార్గెట్ చేయడం దారుణం, ఇలాంటి వైఖరి తీవ్రవాద, ఉగ్రవాద మతోన్మాద లక్షణాల తో సమానం. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో కొన్ని బీజేపీ పాలిత ప్రాంతాల్లో పేర్లు మతం అడిగి ముస్లిం మైనార్టీలు ఐతే హింసించడం, ఊరు ఖాళీ చేసి వెళ్ళిపోమనడం చాలా ఘోరం అని వారి పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా , దేశ ప్రధాన మంత్రి మోడీ గారు పరిస్థితులు చేయి దాటక ముందే కఠిన చర్యలు తీసుకోవాలని, సబ్ కా సాత్ సబ్ కా వికాస్ మరియు విశ్వాస్ అనే నినాదాన్ని చేతల్లో అమలు చేసి చూపాలని అడ్వకేట్ సాదిక్ షేక్ కోరారు. జైపూర్ నుండి ముంబై వెళుతున్న ఆర్ పి ఎఫ్, సబ్ ఇన్స్పెక్టర్ తీకారాం మీనా మతం అడుగుతూ, ముస్లిం లు అని గడ్డం టోపీ ఉన్న నలుగురు అమాయకులను నిర్ధక్షణ్యం గా తుపాకీ తో కాల్చి చంపిన ఘటన ను గుర్తు చేశారు.

జమ్మూ కాశ్మీర్ అనంత్ నాగ్ జిల్లా పహల్గాం లోని బైసరన్ వ్యాలీ లో ఏప్రిల్ 22 న తీవ్రవాదుల కాల్పుల్లో 26 మంది అమాయక పర్యాటకులు ప్రాణాలు కోల్పోవడం జరిగింది, 20 మంది తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న విషయం మనందరికీ తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలు ఆంధ్రా , తెలంగాణ లోనే కాక యావత్ భారతదేశం లో శాంతియుత నిరసనలు తెలపడం, టెర్రరిజం ముర్దాబాద్, పాకిస్తాన్ ముర్దాబాద్, హిందూస్తాన్ జిందాబాద్ అనే నినాదాలు ఇవ్వటం జరిగింది. దోషులను కఠినంగా శిక్షించాలని, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందిస్తూ బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకోవాలని ప్రతి ఒక్కరు కుల మత రాజకీయాలకు అతీతంగా డిమాండ్ చేస్తూ నిరసనలు చేయడం జరిగింది అని సాదిక్ షేక్ పేర్కొన్నారు. పహల్గాం లో టూరిస్ట్ గైడ్ లు , గుర్రాలు నడిపించే వారు లోకల్ కాశ్మీరీ ముస్లిం లు ముష్కరులు చేస్తున్న దాడి నుండి ఎందరో పర్యాటకులను కాపాడి సహకరించిన విషయం మరిచిపోవద్దని వారు కూడా ముస్లిం లేనని గుర్తు చేశారు.



ఘటన జరిగి నాలుగు రోజులు గడుస్తున్న దాడి లో పాల్గొన్న ఉగ్రవాదులను పట్టుకోవడం లో కానీ తీవ్రవాద సంస్థను నేటి వరకు కేంద్ర హోం శాఖ గుర్తించకపోవడం బాధాకరం అన్నారు .పహల్గాం ఘటన నేపథ్యం లో పాకిస్తాన్ తో ఎటువంటి సంబంధాలు కొనసాగించరాదని భారత విదేశాంగ శాఖ తీసుకున్న నిర్ణయాలను స్వాగతిస్తూ ఇవి కేవలం రాజకీయ, మీడియా వ్యాఖ్యలుగా కాకుండా పూర్తి స్థాయి లో తీవ్రవాదం ను, తీవ్రవాదులను భారతదేశం వైపు కన్నెత్తి చూసే సాహసం కూడా చేయకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సాదిక్ షేక్ డిమాండ్ చేశారు. బీజేపీ అధికారం లోకి వచ్చిన తరువాత ఆర్టికల్ 370 తొలగించడం ద్వారా ఎన్నో అద్భుతాలు జరుగుతాయి అని వాగ్దానాలు చేసిన మోడీ బీజేపీ ప్రభుత్వం కనీసం సరైన నిఘా ఏర్పాటు చేసిన పహల్గాం లో అమాయకుల ప్రాణాలు పోయేవి కాదని, ఈ ఘటన వెనుక కేంద్ర నిఘా వ్యవస్థల వైఫల్యం ఉందని న్యాయవాది సాదిక్ షేక్ పేర్కొన్నారు. బిజేపి అధికారం లో వచ్చిన తరువాత ఎన్నో ఘటనలు జరిగాయని అందులో ఉరి మరియు పఠాన్ కోట్ ఘటనలను గుర్తు చేశారు.

తీవ్రవాదానికి మరియు ఉగ్రవాదానికి ప్రత్యేక కులం మతం అంటూ ఉండవని ముఖ్యంగా పాకిస్తాన్ తీవ్రవాదులు ఎప్పుడూ భారతదేశం లో ఉన్న హిందూ ముస్లింల ఐక్యతను దెబ్బతీయాలని కుట్రలు పన్నుతూ ఉంటారు అందులో భాగంగానే పహల్గాం లో చేసిన దాడి విషయం లో మతం అడిగి కాల్చడం జరిగింది అనేది ప్రతి ఒక్కరు గ్రహించాలని సాదిక్ షేక్ కోరారు. బిజేపి పాలిస్తున్న కొన్ని ప్రాంతాల్లో నిరుపేద అమాయక ముస్లిం మైనారిటీలను పేర్లు అడుగుతూ, వారు ముస్లిం లు అయితే ఊరు ఖాళీ చేసి వెళ్ళిపోవాలని బెదిరించడం దాడులు చేయడం పై కూడా కేంద్ర హోం శాఖ ప్రత్యేక నిఘా పెట్టాలని, మోడీ, అమిత్ షా, ఇటువంటి మతోన్మాద ప్రవృత్తి కలిగిన వారిని కఠినంగా శిక్షించాలని సాదిక్ షేక్ కోరారు. సామాజిక మాధ్యమాల్లో యువతి యువకులు చాలా బాధ్యత గా మసులుకోవాలనీ, ఇది అంతర్జాతీయ విషయం, మన దేశ భద్రతకు సంబంధించిన అంశం కాబట్టి ఎవ్వరు కూడా తొందరపడి ఎటువంటి వీడియోలు, ఫోటోలు, వ్యాఖ్యలు వైరల్ చేయరాదని కోరారు. ఒకటికి పది సార్లు సరిచూసుకుని ఫేక్ కాకుండా, హింసను ప్రేరేపించే లా కాకుండా చూసుకోవాలని సమాజం లో బాధ్యతకలిగిన పౌరులు గా నడవాలని, లౌకికవాదం భిన్నత్వం ఏకత్వం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా కొందరు బీజేపీ నాయకులు కాషాయ సంఘాల వారు ఒక సామాజిక వర్గానికి చెందిన వారిని టార్గెట్ చేస్తూ రాజకీయాలు చేయడం , హింసను ప్రేరేపించడం కూడా ఉన్మాద మతోన్మాద చర్యే అని దీని ద్వారా పాకిస్తానీ ఉగ్రవాదుల కుట్ర ఫలించినట్టే అవుతుంది అనేది గ్రహించాలని, ఇటువంటి క్రూరమైన అమానవీయ వైఖరిని ఎవరు అవలంబించరాదని ముఖ్యంగా యువత దూరంగా ఉండాలని చేతులు జోడించి అడ్వకేట్ సాదిక్ షేక్ వేడుకున్నారు



## రజతోత్సవ సభకు కదిలిన బిఆర్ఎస్ శ్రేణులు

భద్రాద్రి కొత్తగూడెం/వాయిస్ టుడే : బిఆర్ఎస్ పార్టీకి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతూర్తి నందు బిఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న బహిరంగ సభకు లక్ష్మీదేవిపల్లి మండలం నుండి బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఆదివారం భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడు కోట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 420 హామీలను ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శేషాద్రి వినోద్, తోట శ్రీనివాస్, కొంపెల్లి వెంకన్న, కిషన్, తరాల దాము, లావుడియా వెంకటేష్, పూర్ణాచారి, జక్కుల శ్రీను, రాంజీ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు

కామారెడ్డి వాయిస్ టుడే ఏప్రిల్ 27: బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తైన సందర్భంగా ఆదివారం చలో వరంగల్ కార్యక్రమానికి బయలుదేరే ముందు కామారెడ్డి పట్టణంలో ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. రైల్వే బ్రిడ్జి వద్ద అంబేద్కర్ విగ్రహం పక్కన భారత రాష్ట్ర సమితి జెండాను కామారెడ్డి జిల్లా అద్యక్షులు యం.కె ముజీబొద్దీన్ ఆవిష్కరించారు. జెండా ఊపి కార్యకర్తలతో బస్సులు ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత గరిగంటి లక్ష్మినారాయణ పాల్గొన్నారు.




## మంకీ బాత్ ప్రోగ్రాం అవగాహన కార్యక్రమం



కామారెడ్డి ఏప్రిల్ 27: 12వార్డు లోని బూత్ నెంబర్ 198లో 121 వా మనకిబాత్ ప్రోగ్రాంలో భాగంగా కామారెడ్డి జిల్లా అధ్యక్షులు నీలం చిన్న రాజులు గారు,12వార్డు ఇంచార్జ్ కామారెడ్డి టౌన్ బీజేపీ ఉపాధ్యక్షులు చినోల్లా రజినీకాంత్ రావు గారు,బూత్ అధ్యక్షులు పేదోళ్ల గోపాల్ రామకృష్ణ గారు రాష్ట్ర కిసాన్ మోర్చా నెంబర్ తుమ్మ బాలకిషన్ గారు,తెలు స్వామి,10వార్డు ఇంచార్జి కాసార్ల రవీందర్,ఓబీసీ మోర్చా టౌన్ ప్రధాన కార్యదర్శి కానకుంట గోవర్ధన్ దొడ్ల స్వామి రజినీకాంత్ ప్రభాకర్, శ్రీకాంత్, కిరణ్ కుమార్ మరియు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రమాదమని అని తెలిసినా టింబర్ యాజమాన్యం నిర్లక్ష్యం

### ట్రాన్స్ఫార్మర్ కురుమపైన చెక్కపొట్ల బెలుడు నిర్లక్ష్యం



కామారెడ్డి వాయిస్ టుడే ఏప్రిల్ 27: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పట్టణంలోని జాతీయ రహదారి ఎన్ హెచ్ 7 రోడ్డు ప్రక్కన కట్టే కోత మిషన్ ప్రక్కన టింబర్ లోని కలప కోసిన తర్వాత పనికిరాని టేకు వుడ్ తోడుకలను విచ్చలవిడిగా నాలుగ ఐదు మీటర్ల రోడ్డు ప్రక్కన పడవేయడం గత కొద్ది నెలలుగా జరుగుతున్న సమస్య ముందే ఎండాకాలం జాతీయ రహదారి నుండి ఇంటర్నేషన)ల్ రోడ్డుపై కళాశాలకు వెళ్లే విద్యార్థులు విద్యార్థినిలు ప్రయాణికులు పాదాచారులు ఎందరో అధికారులు అక్కడ నుంచి వెళ్తుంటారు. మున్సిపల్ అధికారులు. ఫైర్ సిబ్బంది టీజీ ట్రాన్స్కో అధికారులు చూసి చూడనట్లుగా సంవత్సరం కాలం నుండి ఇక్కడ నుండి చెత్త తీసివేయకపోవడం గమనార్ధం పాదాచారులు బీడీ గాని సిగరెట్ గ పడవేస్తే జరగరాని సంఘటనలు జరుగుతాయి పాదాచార్యులు అంటున్నారు వెంటనే అధికారులు వెంటనే అధికారులు స్పందించి అక్కడ అవసరమైన మొక్కలను నాటాలని ప్రజలు అంటున్నారు.

## రాష్ట్రాభివృద్ధి మా ధ్యేయం:కేశినేని శివనాథ్

(ఎన్టీఆర్ జిల్లా)విజయవాడ : డిఫెన్స్, ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ పాలసీపై మీట్ విత్ స్టేక్‌హోల్డర్స్ కార్యక్రమమాన్ని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసేందుకు స్టేక్ హోల్డర్స్ కి లేఖ రాసి ఆహ్వానం పలికినట్లు పాలసీ రూపకల్పనలో కీలక భాగస్వాములు కావాలని కోరినట్లు ఎంపి కేశినేని శివనాథ్ ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. రాష్ట్రంలో డిఫెన్స్, ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ అభివృద్ధి చేసేందుకు వాటాదారుల అనుభవం, ఆలోచనలు తెలియజేసేందుకు ఈ నెల 28వ తేదీ సోమవారం విజయవాడలోని హెూటల్ వివంత లో ఏర్పాటు చేస్తున్న మీట్ విత్ స్టేక్ హోల్డర్స్ కార్యక్రమంలో పాల్గొనాలని ఎంపి కేశినేని శివనాథ్ ఆహ్వానించారు. కీలకమైన డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ సంస్థలు, ఇతర భాగస్వాములు పాల్గొననున్న ఈ సమావేశం, రాష్ట్రాన్ని డిఫెన్స్ ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా అభివృద్ధి చేయడం లక్ష్యంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ పాలసీ రూపకల్పనకు, రాష్ట్రంలో డిఫెన్స్, ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గాఅభివృద్ధి చేసేందుకు స్టేక్ హోల్డర్స్ అనుభవం, ఆలోచనలు చాలా అవసరమన్నారు. డిఫెన్స్, ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ పాలసీ, క్లస్టర్‌ల రూపకల్పన విషయంలో స్టేక్ హోల్డర్స్ సలహాలు సూచనలు అందించటంతోపాటు సహకారం అందించి రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పాడునివ్వాలని ఎంపి కేశినేని శివనాథ్ కోరినట్లు తెలిపారు.

## ఛలో వరంగల్

హుజూర్నగర్ ఏప్రిల్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి) హుజూర్నగర్ పట్టణంలో ఆదివారం వరంగల్, ,ఎల్కతుర్తి వద్ద జరిగే బీ ఆర్ ఎస్ పార్టీ 25 ఏండ్ల ఆవిర్భావ దినోత్సవ భారీ బహిరంగ సభకు హుజూర్ నగర్ నుండి భారీ ఎత్తున బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులు ఈ కార్యక్రమాన్ని హుజూర్నగర్ మాజీ జెడ్పిటిసి కొప్పుల సైదిరెడ్డి గారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, హుజూర్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ సోషల్ మీడియా సభ్యులు, పార్టీ నాయకులు, యువత కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి చట్టం

**తహాశీల్దార్లు వెంకటేశ్వర్లు, తఫజ్జుల్ హుస్సేన్**



పాలేరు, ఏప్రిల్ 27 (వాయిస్ టుడే)....అన్నదాతల భూ సమస్యల పరిష్కారనికే తెలంగాణ ప్రభుత్వం భూ భారతి చట్టం ప్రవేశపెట్టిందని,దీంతో భూ సమస్యలు వేగంగా పరిష్కారం కానున్నాయని తహాశీల్దార్లు వెంకటేశ్వర్లు, తఫజ్జుల్ హుస్సేన్ లు తెలిపారు. ఆదివారం నేలకొండపల్లి మండలం రామచంద్రాపురం, రాజేశ్వరపురం గ్రామాలలో జరిగిన రెవెన్యూ సదస్సులో వారు మాట్లాడుతూ...భూ సమస్యలు ఉన్న రైతుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రైతులకు తమ భూముల యడల అభద్రత భావానికి తావు లేకుండా జవాబుదారుతనంగా ఉండేందుకే భూ భారతి చట్టాన్ని సీఎం రేవంత్ రెడ్డి, రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతాయని వివరించారు. రైతులకు, అధికారులకు సులభంగా అర్ధం అయ్యేలా సామాన్య, గ్రామీణ ప్రజల,రైతుల సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా భూ భారతి చట్టం ఉండనుందని చెప్పారు.

హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు భూ భారతిలో అవకాశం ఉందన్నారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందన్నారు. భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించిన మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేయవచ్చున్నారు. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టంలో రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని అన్నారు. భూదార్ కార్డుల జారీ జరుగునుందన్నారు.రైతులకు ఉచిత న్యాయ సహాయం లభిస్తుందని చెప్పారు.గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి, ఎవరైనా ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దుచేసే అధికారం చట్టంలో కూడా ఉందన్నారు.

హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉంది రికార్డులో లేనివారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవడానికి కొత్త చట్టం వచ్చిన సంవత్సరం లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా రామచంద్రాపురం గ్రామంలో చేపట్టిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 24, రాజేశ్వరపురం గ్రామ రెవెన్యూ సదస్సులో 182 దరఖాస్తులు అధికారులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులకు అధికారులు రశీదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల ఆర్ఐలు రవి, మధు, అధికారులు, పలువురు రైతులు పాల్గొన్నారు.



## బి ఆర్ ఎస్ జెండాను ఆవిష్కరించిన మాజీ సర్పంచ్ కర్నాటి నాగిరెడ్డి

హుజూర్నగర్ ఏప్రిల్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి): హుజూర్నగర్ నియోజకవర్గంలోని గరిడేపల్లి మండలం సర్వారం గ్రామంలో బీ ఆర్ఎస్ ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం చలో వరంగల్ కార్యక్రమానికి బయలుదేరే ముందు సర్వారం గ్రామంలో ఆ పార్టీ జెండాను మాజీ సర్పంచ్ కర్నాటి నాగిరెడ్డి ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు బారెడ్డి గోవిందరెడ్డి బోగాల జనార్ధన్ రెడ్డి వెంకన్న విజయ్ సిద్దయ్య వెంకటేశ్వర్లు బి ఆర్ఎస్ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

## అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన రఘును ఘనంగా సన్మానించిన ప్రముఖులు




హుజురాబాద్ ఏప్రిల్ 27 (వాయుస్ టుడే): ఇటీవల హిమాచల్ ప్రదేశ్ లోని ధర్మశాలలో జరిగిన జాతీయ మాస్టర్స్ గేమ్స్, అథ్లెటిక్స్ పోటీలను హైమర్ త్రో 35o విభాగంలో అత్యంత ప్రతిభను కనబరిచి కాంస్య పథకాన్ని గెలుపొందిన రఘు కి హుజురాబాద్ మండలం చెల్పూర్ గ్రామస్తులు శనివారం సాయంత్రం గ్రామపంచాయతీ ఆవరణంలో అభినందన సభను ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ పాల్గొని రఘుని శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రఘు నిరుపేద కుటుంబంలో పుట్టి, ఉన్నత చదువులు అభ్యసించి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికై జీవనం కొనసాగిస్తున్న తరుణంలో ఇటీవల మాస్టర్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలలో జాతీయస్థాయిలో అత్యంత ప్రతిభను కనబరిచి పథకం సాధించడం చెల్పూర్ గ్రామానికి కాకుండా ఈ రాష్ట్రానికి గర్వకారణమని కొనియాడారు, సింగపూర్ లో జరిగే అంతర్జాతీయ పోటీలలో పాల్గొని పథకాలు సాధించాలని కోరారు. నేటి సమాజంలో యువకులందరూ ముందుకు మత్తు పానీయాలకు డ్రగ్స్ కు గంజాయికి అలవాటు పడుతున్న తరుణంలో రఘు క్రీడల్లో పథకాలు సాధించడం గర్వకారణమని తెలుపుతూ వారిని ఆదర్శంగా తీసుకోవాలని యువకులకు పిలుపునిచ్చాడు. యువకులు వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకుండా తల్లిదండ్రుల కలలు కన్నా కళలను సహకారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జయ భారతి విద్యాసంస్థల చైర్మన్ ప్రతాపరెడ్డి, అంతర్జాతీయ క్రీడాకారులు అంబాల ప్రభాకర్ ప్రభు, వంతడుపుల బాబు, జైపాల్ రెడ్డి, వేల్పుల రత్నం,జకర్యా, సాయిబాబా, పంజాల కృష్ణమూర్తి, కోడిగుటి ప్రవీణ్, సదానందం,సమ్మెట సంపత్, మొలంగూరి ప్రభాకర్, దయాకర్,గన్ను అశోక్, రామ్ రాజలింగం,రాజేశ్వర్, శనిగరం రవి, ఆకునూరి రవీందర్, వంతడుపుల రమేష్,నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## పహల్గం ఉగ్ర దాడితో భారతీయుల రక్తం మరిగిపోతుంది...

**దేశ, ప్రపంచవ్యాప్తంగా ఉగ్ర మూకల దాడిని ఖండిస్తూ నిరసన బాటలో ఉన్నాయి..**

**రాష్ట్రంలోని బిఆర్ఎస్ రజతోత్సవ సభతో రాజకీయ పండగ చేసుకుంటుంది...**

**జిల్లా అధ్యడిక్షుడు గంగాడి కృష్ణారెడ్డి వ్యాఖ్యలు..**



జమ్మికుంట ఏప్రిల్ 27 (వాయుస్ టుడే): పట్టణ పరిధిలోని ఎంప్లాయిస్ కాలనీ 178 వ పోలింగ్ బూత్ లో స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆదివారం రోజున ప్రసారమైన ప్రధాని మన్ కి బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ పహల్గాం ఉగ్ర దాడితో భారతీయుల రక్తం మరిగిపోతుందని, ఇది వాస్తవమని , దేశ ప్రజల మనసులో ఉన్న భావనను ప్రధాని మోదీ మన్ కి బాత్ సందర్భంగా తెలియజేశారని పేర్కొన్నారు. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ దేశ, ప్రపంచవ్యాప్తంగా అనేక నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ కు తగిన గుణపాఠం చెప్పాలని భారతీయులందరూ కోరుకుంటున్నారని , ఈ విషయంలో దేశమంతా ఒకే తాటిపై కి వచ్చిందన్నారు. గత ముఖ్యమంత్రి , బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ కు ఉగ్ర దాడిని ఖండించి, కనీసం నిరసన వ్యక్తం చేయడానికి బయటికి రాలేక పోయారని నేడు సిల్వర్ జూబ్లీ పేరిట ఆ పార్టీ చేపట్టిన వేడుకలతో రాజకీయ పండుగ సంబరాలుచేసుకోవడానికి బయటికి వచ్చారని ఆయన ఘాటుగా విమర్శించారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, కంకణాల రమాదేవి, ఇంచార్జీ ప్రవీణ్ రెడ్డి, పట్టణ సీనియర్ నాయకులు ఆకుల రాజేందర్, జీడి మల్లేష్, ఆవాల రాజిరెడ్డి, దొంతుల రాజు కుమార్, బచ్చు శివన్న, మోతె స్వామి, పల్లపు రవి, కైలాసకొటి గణేష్, ఇటుకాల స్వరూప ముకుందా సుధాకర్, కొండపర్తి ప్రవీణ్, బూరుగుపల్లి రాము, యగ్గని చందు, కేశ స్వరూప, కనుమల్ల లక్ష్మి, కొండ్రా సులోచన, గండికోట సమ్మయ్య, శ్రీవర్తి ప్రవీణ్, అఖిల్, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

## ఖని ప్రభుత్వాసుపత్రిలో కలెక్టర్ భార్య ప్రసవం

గోదావరిఖని పట్టణం: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సతీమణి విజయ రెండో కాన్పులో మగబిడ్డకు జన్మనిచ్చారు. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రభుత్వ ఆస్పత్రిలోనే పరీక్షలు చేయించుకుంటున్న ఆమె శనివారం రాత్రి పురిటినొప్పులు రావడంతో ఆస్పత్రిలో చేరారు. వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి మగబిడ్డకు పురుడు పోశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలపై ప్రజల్లో నమ్మకం పెంచడానికి కలెక్టర్ తన సతీమణికి క్రమం తప్పకుండా ఖని ఆసుపత్రిలోనే పరీక్షలు జరిపించడం, ఇక్కడే కాన్పు చేయించడాన్ని పలువురు అభినందిస్తున్నారు.






## ఘనంగా ఎం సత్యనారాయణరావు (ఎమ్మెస్సార్) వర్ధంతి

జమ్మికుంట ఏప్రిల్ 27 (వాయుస్ టుడే): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ పిసిసి అధ్యక్షులు కీర్తిశేషులు ఎం సత్యనారాయణ రావు (ఎమ్మెస్సార్) వర్ధంతి నీ జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1969 ప్రత్యేక తెలంగాణ పోరాటంలో కీలకపాత్ర పోషించారు, 1971 లో కరీంనగర్ లోక్సభ నియోజకవర్గం నుండి పోటీ చేసి ఎంపీగా వరుసగా మూడు పర్యాయాలు గెలిచారు, 1983 వరకు ఏఐసిసి ప్రధాన కార్యదర్శిగా ఉండి 1985 నుండి 88 వరకు సుప్రీంకోర్టు లో సీనియర్ కౌన్సిల్ గా పని చేశారు. 1990 నుండి 94 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ చైర్మన్గా బాధ్యతలు నిర్వహించారు, ఇలా వారు ఎన్నో పదవులను అధిరోహించి ఇటు జిల్లాలో అటు రాష్ట్రంలో దేశ రాజకీయాలలో కీలకపాత్ర వహించిన ఉద్దండోడు ఎమ్మెస్సార్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ గూడెం సారంగపాణి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజేశ్వరరావు, లింగారావు, రామకృష్ణ , చిన్నింటి నాగేంద్ర, అశోక్ పాతకాల ప్రవీణ్, మురళీ పాల్గొన్నారు.



## భాదిత కుటుంబాలను పరామర్శించిన చావా

పాలేరు, ఏప్రిల్ 27 (వాయిస్ టుడే ) తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన రావూరి సురేందర్, కేశవాపురం గ్రామానికి చెందిన ఉన్నం భారతమ్మ అనారోగ్య కారణాలతో మృతి చెందగా ఆదివారం పాలేరు నియోజకవర్గం ఆత్మ కమిటీ చైర్మన్,కాంగ్రెస్ జిల్లా నాయకులు చావా శివరామకృష్ణ భాదిత కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతిని తెలిపి సంతాపన్ని ప్రకటించారు. తొలుత మృతుల చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు తాటికొండ కిరణ్, సిరిగద్దె ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు...



## పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన అమరవీరులకు ఘన నివాళులు

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన అమరవీరుల స్మరణార్ధం యాదగిరిగుట్ట పాదాల నుండి అమరవీరుల స్తూపం వరకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యఆధ్వర్యంలో కోవత్తులతో ర్యాలీ నిర్వహించి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని బలితీసుకున్న ఉగ్రవాదులను ఎట్టి పరిస్థితుల్లో విడిచిపెట్టకూడదని, వారికి తగిన గుణపాఠం నేర్పించాలని హితవుపలికారు.భారతదేశంలో హిందువులు,ముస్లిం లు,క్రైస్తవులు అన్నదమ్ముల్లా శాంతిగా నివసిస్తున్నప్పుడు, దేశంలో అలజడి సృష్టించాలని కుట్రపూరితంగా ప్రవర్తిస్తున్న ఉగ్రవాదులను కుకటి వేళ్లతో పెకిలించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు, రాజకీయ నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పహల్గాం దాడి అమానుషం.....

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్**

పాలేరు, ఏప్రిల్ 27 (వాయిస్ టుడే): ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో వరంగల్ క్రాస్ రోడ్డులో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం పహల్గాం ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ శాంతియుతంగా సిపిఐ పార్టీ కార్యాలయం నుండి చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి, మృతులకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ.. మంగళవారం పాక్ ఉగ్రవాదులు పహాల్గాం పర్యాటకులపై కాల్పులు జరిపి 32 మందిని పొట్టనపెట్టుకొన్నారని, అనేక మందికి తీవ్రగాయాలపాలు చేశారని ఇది అమానుష చర్యని అన్నారు. ఈ దాడిని ప్రతీ ఒక్కరూ ఖండించాలని, మరలా ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా కేంద్ర ప్రభుత్వం దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకటరెడ్డి, ఐఏఎల్ జాతీయ సమితి సభ్యులు ఓరుగంటి శేషగిరి, జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్,బానోతు రాంకోటి,సిపిఐ మండల సమితి సభ్యులు వెంపటి సురేందర్,దండి రంగారావు,వెన్నం భాస్కర్,శాబాద్ పెద్ద సైదిరెడ్డి, బియ్యాల రాజు, బుద్ధి రాధాకృష్ణ, వెంపటి రాము, ఏఐవైఎఫ్ సభ్యులు మిరియాల వరుణ్ తేజ్,మేళ్లచెరువు సాయి,సురేష్, నరేశ్,అక్కినపల్లి దేవయ్య, రెబ్బగొండ్ల గోపి, చింతల ఉదయ్, కొక్కు రిత్విక్ తదితరులు పాల్గొన్నారు.



## కనకదుర్గ ఆలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రత్యేక పూజలు

హుజూర్నగర్ ఏప్రిల్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి) హుజూర్ నగర్ పట్టణంలోని స్వయంభు కనకదుర్గాదేవి ఆలయంలో హుజూర్నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేశ్ ముఖ్ రాధిక అరుణ్ కుమార్ దంపతులు, జిల్లాకోర్టు ఏజిపి శ్రీనివాసుల రేణుక రవికుమార్ దంపతులు ఆదివారం కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటి చైర్మన్ బాచిమంచి కొండయ్య - రాజ్యలక్ష్మి దంపతులు వారిని సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికి శాలువా గజమాలతో సత్కరించారు. మరిన్ని ఉన్నతమైన పదవులను అలంకరించాలని అమ్మవారి ఆశీస్సులు వారికి ఎప్పుడూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు ధూళిపాళ రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు



## నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి: రాజ్ కుమార్ రెడ్డి

**3న 'పేట'లో మెగా జాబ్ మేళా**

**జాబ్ మేళా కరపత్రం ఆవిష్కరణ**

నారాయణపేట, (వాయిస్ టుడే): నారాయణపేట జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశం కల్పించేందుకు భీష్మరాజ్ ఫౌండేషన్ నడుం బిగించిందని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కే.రాజ్ కుమార్ రెడ్డి అన్నారు. భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణపేట కూరగాయల మార్కెట్ రోడ్డులో ఉన్న ఎస్.ఆర్.గార్డెన్స్ లో మే 3వ తేదీ శనివారం ఉదయం 9.30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించ తలపెట్టిన మెగా జాబ్ మేళాకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం నారాయణపేటలో రాజ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో చదువులు పూర్తి చేసిన యువతీ యువకులు ఈ మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ జాబ్ మేళాలో సుమారు 50 ప్రముఖ ఎం.ఎన్.సీ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఈ ఆవిష్కరణలో ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, పోలీసు పటేల్ మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, గోపాల్ గౌడ్, హనుమంతు, వై.సంతోష్, శివరాజ్, ఎం.సంతోష్, నరేష్ గౌడ్, కృష్ణ, చామకూర నగేష్, వంశీరెడ్డి, గోపాల్, అశోక్, వెంకటరావు తదితరులు ఉన్నారు.

## ఎస్ఎఫ్ఐ ఓ విశ్వవిద్యాలయం

**ముగిసిన రాష్ట్ర మహాసభలు**



ఖమ్మం: భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) ఓ విశ్వవిద్యాలయం లాంటిదని, ఎలా జీవించాలో.. ఎలాంటి వర్గ దృక్పథంతో ఉండాలో నేర్పిస్తుందని ఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షుడు నితీశ్ నారాయణ్ పేర్కొన్నారు. ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో మూడు రోజుల పాటు జరిగిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 5వ మహాసభలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు సభకు ముఖ్యవక్తగా హాజరైన నారాయణ్ మాట్లాడారు. స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం పునాదులపై ఎస్ఎఫ్ఐ నిర్మితమైందని తెలిపారు. శ్రమజీవుల పక్షాన నిలిచేది ఎస్ఎఫ్ఐ అన్నారు. కేంద్ర ప్రభుత్వం సెక్యూలరిజంపై మాట్లాడితే స్కాలర్స్‌ను విశ్వవిద్యాలయాల నుంచి బహిష్కరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి సమస్యలపై ప్రశ్నిస్తే నేతలపై దేశ ద్రోహం కేసు నమోదు చేస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం భూములను కాజేసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. జై భీమ్ చిత్రం ఇతివృత్తానికి సంబంధించిన జస్టిస్ చంద్రు ఎస్ఎఫ్ఐకు చెందిన వారే కావడం గర్వకారణమన్నారు. త్యాగధనులు పుట్టిన గడ్డ ఖమ్మంలో మహాసభలు జరగడాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నిర్మాణంపై జాతీయ అధ్యక్షుడు వీపీ సాను ప్రసంగించారు. హైదరాబాద్ సెంట్రల్ విశ్వవిద్యాలయం విద్యార్థుల పాటలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కోయ చంద్రమోహన్, ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి, సోషల్ మీడియా రాష్ట్ర నాయకుడు పిట్టల రవి, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కల్లూరు మల్లేశ్, ఎస్ఎఫ్ఐ పూర్వ నాయకుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**17 తీర్మానాలకు ఆమోదం**

రాష్ట్ర మహాసభ 17 తీర్మానాలను ఆమోదించింది. నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని, విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించాలని, తెలంగాణలో గురుకులాలు, సంక్షేమ వసతిగృహాలకు సొంత భవనాలు నిర్మించాలని, మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని మరికొన్ని తీర్మానాలకు మహాసభ ఆమోదం తెలిపింది.

## భార్యతో గొడవ పడి.. బలవన్మరణం



జాజిరెడ్డిగూడెం: భార్యతో గొడవ పడి వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన శనివారం రాత్రి మండలంలోని కొమ్మాల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన జక్కలి జనార్దన్(30), కొమ్మాల గ్రామానికి చెందిన నవ్యను తొమ్మిదేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఉగాది పండగకు నవ్య పుట్టింటికి వచ్చి వెళ్లలేదు. మూడు రోజుల క్రితం జనార్దన్ కొమ్మాలకు వచ్చి ఇక్కడే ఉంటున్నట్లు తెలిపారు. శనివారం రాత్రి భార్యతో ఘర్షణ పడి బెడ్ షీట్ తీసుకుని ఆరుబయట పడుకుంటానని చెప్పాడు. రాత్రి 2 గంటల సమయంలో గ్రామ సమీపంలోని వ్యవసాయ బావి వద్ద రేకుల షెడ్డుకు ఉరి వేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలున్నారు. జనార్దన్ తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్వపల్లి ఎస్సై బాలకృష్ణ తెలిపారు.

## యాదగిరిగుట్ట ఆలయ ఈవోగా ఐఏఎస్ అధికారి



యాదగిరిగుట్ట: తెలంగాణలో ప్రసిద్ధి చెందిన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారిగా ఎస్.వెంకట్రావును నియమిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్షేత్రానికి తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో పాలక మండలి(బోర్డు)ని ఏర్పాటు చేస్తామని ఆది నుంచి సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్న మాటను నిజం చేసే ప్రక్రియలో భాగంగా ఐఏఎస్‌ను నియమించారు. వెంకట్రావు యాదాద్రి భువనగిరి జిల్లాలో డీఆర్‌డీవోగా, సూర్యాపేట కలెక్టర్‌గా విధులు నిర్వహించారు.

తితిదే తరహాలో బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగంగా తొలి అడుగు ఐఏఎస్ అధికారిని ఈవోగా నియమించడం, ఇక త్వరలోనే 18 మందితో కూడిన ఆలయ పాలకవర్గాన్ని ఏర్పాటు చేయనుంది. ఆలయానికి 1969లో రాష్ట్ర దేవాదాయ శాఖ అజమాయిషీ మొదలైంది. అసిస్టెంట్ కమిషనర్ స్థాయి నుంచి డిప్యూటీ కమిషనర్, రీజినల్ జాయింట్ కమిషనర్ హోదా ఉన్న అధికారులతో ఆలయ పాలన కొనసాగించారు. ఈ క్రమంలో రెవెన్యూ శాఖకు చెందిన స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌రావు 2024 మార్చి 16న ఈ ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన విషయం విధితమే. ఐఏఎస్ అధికారి నియామకంతో భాస్కర్‌రావు మరో చోటుకు బదిలీ అయ్యారు. బదిలీ అయిన వివరాలు తెలియాల్సి ఉంది.



# అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

**రాజ్యాంగ ఫలాలు అందరికీ అందేలా చూడాలి**

**మల్ రెడ్డిపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణలో సినీనటుడు**

**ఆర్.నారాయణమూర్తి, వక్తలు**

నారాయణపేట, వాయిస్ టుడే: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ నడుం బిగించాలని సినీ నటుడు, దర్శక, నిర్మాత ఆర్.నారాయణమూర్తి, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాగర్, భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డిలు పిలుపునిచ్చారు. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం మల్ రెడ్డి పల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఆదివారం సాయంత్రం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి లక్ష్యంగా నాడు బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి, తాను రచించిన రాజ్యాంగ ఫలాలు ప్రతి ఒక్కరికి అందేలా ఎనలేని కృషి చేశారని కొనియాడారు. హాలో అంబేద్కర్ చూపిన మార్గంలో యువతరం పయనించి దేశాభివృద్ధికి పాటుపడాలని కోరారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా కళాకారులు ఆటాపాట చేపట్టారు. జై భీమ్ నినాదాలతో పరిసరాలు మార్మోగాయి. అనంతరం వక్తలు ప్రజలకు అభివాదం చేశారు. అంతకుముందు వక్తలను సభా నిర్వాహకులు శాలువలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆర్.నారాయణమూర్తి పాటలు పాడుతూ ప్రజలను ఉర్రూతలూగించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వెంకటప్ప, చంద్రప్ప, ఓయూ విద్యార్థి శరత్, కవులు, కళాకారులు, భీష్మరాజ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఎన్ని కుట్రలు పన్నినా కేసీఆర్‌ను ఆపలేరు: పువ్వాడ



**నగరంలో భారాస జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి పువ్వాడ**



తిరుమలాయపాలెం: కాంగ్రెస్ ఎన్ని కుతంత్రాలు చేసినా భారాస రజతోత్సవ సభ విజయవంతాన్ని అడ్డుకోలేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఎల్కతుర్తి బహిరంగ సభకు బయల్దేరి వెళ్తున్న బస్సులను మండల కేంద్రం వద్ద స్థానిక పోలీసులు తనిఖీల పేరుతో నిలిపేశారు. ఈ విషయం తెలుసుకున్న పువ్వాడ వెంటనే భారాస జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి తదితర నాయకులతో కలిసి తిరుమలాయపాలెం చేరుకున్నారు. ప్రధాన కూడలి వద్ద స్థానిక నాయకులతో మాట్లాడారు. ఏం జరిగిందో వివరాలు తెలుసుకున్నారు. వాహనాల నిలిపివేతపై వెంటనే పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సభకు వెళ్లే వాహనాల్ని కమిషనర్ ఆదేశాలతో పోలీసులు వదిలిపెట్టారు. అనంతరం పువ్వాడ విలేకరులతో మాట్లాడుతూ.. 'భారాస సభను అడ్డుకునేందుకు కాంగ్రెస్ కుట్రలు చేసింది. ఎన్నిచేసినా కేసీఆర్ ప్రసంగాన్ని ఆపలేరు. ఆయన మాటల్ని వినకుండా ప్రజలు ఉండలేరు' అన్నారు. జిల్లా నుంచి వాహనాల్లో సభకు తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలకు ఆయన పలు సూచనలు చేశారు.

ఖమ్మం బుర్హాన్‌పురం, కల్లూరు: భారాస రజతోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం 21, 34, 46, 41, 57 డివిజన్లలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. పలు ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాలకు హాజరైన మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జెండావిష్కరణ చేసి ప్రసంగించారు. కార్యక్రమాల్లో కూరాకుల నాగభూషయ్య, పగడాల నాగరాజు, బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్లు పాల్గొన్నారు. కల్లూరు నుంచి ప్రత్యేక బస్సుల్లో భారాస నాయకులు, కార్యకర్తలు సభకు తరలివెళ్లారు.

# గులాబీ జాతరకు కదిలిన దండు

**- దారులన్నీ బీఆర్ఎస్ రజతోత్సవ సభ వైపే**

**- ఎల్కతుర్తి సభకు కదిలిన మండల నాయకులు, కార్యకర్తలు**

**గ్రామాల్లో భారీగా ద బీఆర్ఎస్ జండా ఆవిష్కరణలు**



పెద్దవంగర (వాయిస్ టుడే): : వరంగల్ లోని ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివె ళ్లారు. ఉదయం పెద్ద వంగర మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. మండల టిఆర్ఎస్ అధ్యక్షుడు ఈదురు ఐలయ్య జెండా జెండాను ఆవిష్కరించారు. పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య ఆధ్వర్యంలో సభకు టిఆర్ఎస్ శ్రేణులు తరలి వెళ్లారు. వెళుతున్న వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు.

**గంట్లకుంట:** బీఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాల సందర్భంగా గంట్లకుంట గ్రామం నుండి బీఆర్ఎస్ సీనియర్ జిల్లా నాయకులు పాలకుర్తి యాదగిరిరావు పార్టీ జెండా ఎగురవేసిన సభకు వెళ్లే వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. గ్రామ మాజీ సర్పంచ్ చింతల భాస్కర్ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ శ్రేణులు గ్రామం నుంచి భారీగా తరలి వెళ్లారు.

**రాజ్ మాన్ సింగ్ తండా:** మండలంలోని రాజ్ సింగ్ తండ గ్రామపంచాయతీ నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో రజతోత్సవ సభకు తరలివెళ్లారు. మాజీ సర్పంచ్ గుగులోత్ పటేల్ నాయక్ సభకు వెళుతున్న వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు.

**పోచంపల్లి:** మండలంలోని పోచంపల్లి గ్రామం నుంచి మండల ఉపాధ్యక్షుడు కనుకుంట్ల వెంకన్న, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాసాల సమ్మయ్య ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

**అవుతాపురం:** మండలంలోని అవుతాపురం గ్రామం నుంచి బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు కృష్ణమూర్తి శర్మ బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. పాకనాటి గోపాల్ రెడ్డి, కోట అశోక్, కోట కుమార్ యాదవ్, ఆధ్వర్యంలో పలు వాహనాల్లో భారీగా బయలుదేరారు. ఈ సందర్భంగా వారు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

ఎన్నో ఏళ్ల పోరాటంతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం లక్ష్యం నెరవేరిందన్నారు. 4 కోట్ల ప్రజల దశాబ్దాల ఆకాంక్ష కోసం పుట్టిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ అన్నారు. ఉద్యమ సంస్థగా ఆవిర్భవించిన టీఆర్ఎస్ పార్టీ నేడు బీఆర్ఎస్ పార్టీగా రూపాంతరం చెందిందని, తెలంగాణ రాష్ట్రం పురోగతి సాధించిన గులాబీ జెండా 25 వసంతాలు పూర్తిచేసుకుని తెలంగాణ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.